నిషేధమా..! ఎక్కడా..?

వివిధ రంగాల్లో ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరం నగరం అస్తవ్యస్తంగా తయారైంది. గోదావరి పరివాహక ప్రాంతం, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ నగరానికి నిత్యం దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. నగరపాలక సంస్థ పరిధిలో కనీస నిషేధాలు కూడా అమలు కాకపోవడంతో, దుర్గంధ పూరిత వాతావరణంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రాజధాని ప్రతిష్టకు విఘాతం కలుగుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

- నగరపాలక సంస్థ పరిధిలో అటకెక్కిన నిషేధాలు
- యథేచ్ఛగా పశువుల సంచారం
- ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం
- నిత్యం 80 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి


దుకాణంలో కొనుగోలు చేసిన ప్లాస్టిక్ గ్లాసులు


నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో పశువుల సంచారం, 40 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వాడకాలను నిషేధిస్తున్నట్లు ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా అవి ఏమాత్రం అమలు కావడం లేదు. నగరంలో పశువుల సంచారం యథేచ్ఛగా జరుగుతుండటంతో వాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకల సమయంలో జరుగుతున్న పశువుల సంచారం ప్రమాదాలను తెచ్చిపెడుతోంది..గతంలో రోడ్లపై తిరుగుతున్న పశువులను తరలించేందుకు నగరపాలక సంస్థ ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. నగరంలో పశువులను వదలి వేస్తున్న వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరికలూ జారీ చేసింది. అవేమీ ఇప్పుడు ప్రయోజనం లేకుండా పోయాయి.

భూమి కేటాయింపు

ఉదయం, సాయంత్రం సమయంలో పశువుల యజమానులు పాలు తీశాక, పశువులను రోడ్లపైకి వదిలి వేస్తుండటంతో, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరంలో రోడ్లపై సంచరించే పశువులను ప్రత్యేక వాహనాల్లో తీసుకువెళ్లి, జిల్లాలోని సీతానగరం మండలం బొబ్బిలిలంక గ్రామంలో గోశాలకు తరలించి పోషించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. దీనికోసం నగరపాలక సంస్థ 11 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ చర్యలు తూతూమంత్రంగా మిగిలాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో నిత్యం పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నప్పటికీ, నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి, వీధుల్లో తిరుగుతున్న పశువులపై చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరికలు బేఖాతరు

నగరంలో సుమారు 30 ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులమ్మే షాపులున్నాయి అయితే 40 కన్నా తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ వస్తువులను వాడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసిన నగరపాలక సంస్థ.. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ మైక్రాన్లు కలిగిన ప్లాస్టిక్ కవర్లను హోటళ్లు, తోపుడు బండ్లు, ఇతర చిన్న వ్యాపారులు ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. వీరిపై నగరపాలక సంస్థ పర్యవేక్షణ కొరవడింది. నగరంలో రోజుకు 80 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధించేందుకు ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తామంటూ, వాటిని వాడే వ్యాపారులు, నగర పౌరుల పైనా చర్యలు తప్పవంటూ నగరపాలక సంస్థ జారీ చేసిన హెచ్చరికలు కొంతకాలమే పనిచేశాయి. నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడంతో ఇటీవల కాలంలో ప్లాస్టిక్ వినియోగం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు.


ఓ డ్రైన్ నుంచి బయటకు తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పశువుల సంచారంతో ఇబ్బందులే..



నగరంలో వేలాది మంది ద్విచక్ర వాహనదారులు పశువుల సంచారంతో ప్రమాదాలకు గురవుతున్నారు. నగర వీధుల్లో పశువులు సంచరించడంతో ద్విచక్ర వాహందారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు నిషేధంపై ప్రత్యేక దృష్టి చేపట్టాలి.

– వై.రామకృష్ణ, రాజమహేంద్రవరం

చర్యలు అంతంతమాత్రం



నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు అంతంతమాత్రంగానే చర్యలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ వస్తువులను నగరంలో అమ్మకాలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై పూర్తి చర్యలు చేపడితే స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధ్యమవుతుంది.

– కొయ్య కళ్యాణ్, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ప్రిజన్ కేఫ్ నేడు ప్రారంభం



హోం మంత్రి ప్రారంభించనున్న ప్రిజన్ కేఫ్

కంబాలచెరువు: జైళ్ల శాఖ సౌజన్యంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్, పెట్రోల్ బంకును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించనున్నారు. ఈ వివరాలను జైలు సూపరింటిండెంట్ ఎస్.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర కారాగారంలోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను మంత్రి అందజేయనున్నారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

క్యాన్సర్‌పై కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కంబాలచెరువు: రాష్ట్రస్థాయిలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా ది పీఎంపీ సంఘం రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చిన పీఎంపీలను అభినందించారు. ఈ నెల 15 నుంచి ప్రభుత్వం నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లో ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా అధ్యక్షులు బళ్లా శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.దేవానందం, పి.చిన్ని, రహమాన్‌ఖాన్, మట్టా రమేష్, యు.ప్రసాద్‌బాబు, ఎం.జితేంద్ర, యాళ్ల ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

చేట.. చాపంతయింది..!


రంగంపేట మండలం గోవింద రాజాపురం వద్ద బురదలో కూరుకున్న కొన్ని వాహనాలు

రంగంపేట: రాజానగరం–కాకినాడ ఏడీబీ రోడ్డు అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో రహదారి మరింత అధ్వానంగా తయారైంది. అడపాదడపా చేస్తున్న మరమ్మతులు కొద్దిపాటి వర్షానికి కొట్టుకుపోతున్నాయి. అంతేకాక ప్రజాధనం వృథా అవుతోంది. ఇటీవల రాజానగరం జంక్షన్ వద్ద నల్ల క్వారీ మట్టితో చేసిన మరమ్మతులు వారం రోజులు ఫర్వాలేదనిపించాయి. తర్వాత అది కూడా కొట్టుకుపోయింది. రంగంపేట మండలం గోవింద రాజాపురం, పల్ల కడియం జంక్షన్ వద్ద ఎర్రమట్టి గ్రావెల్‌తో చేస్తున్న మరమ్మతులు ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. మట్టి బురదగా మారి వాహనాలను అదుపు తప్పుతున్నాయి. ద్విచక్ర వాహనాలు ఆ బురదకు అదుపుతప్పి జారిపడుతున్నాయి. కార్లు, ఆటోలు వంటి వాహనాల చక్రాలు బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జాం తప్పడం లేదు. ఆర్టీసీ, స్కూల్, కళాశాల, ట్రావెల్ బస్సులు వంటివి ద్విచక్ర వాహనదారుల సమస్యను, ఇబ్బందులను పట్టించుకోకుండా వేగంగా ప్రయాణిస్తుండటంతో వారు భీతిల్లిపోతున్నారు. ఇంటి నుంచి బయలుదేరిన వారు.. ఈ రోడ్డులో ప్రయాణించి తిరిగి ఇంటికి క్షేమంగా చేరతామన్న గ్యారెంటీ లేదంటున్నారు. అనేక మంది ఈ రోడ్డులో ప్రయాణం మానుకుంటున్నారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి గోతులను పటిష్టంగా పూడ్చించాలని, గోతులున్న చోట సిమెంట్ రోడ్డును నిర్మించాలని, అప్పటి వరకు భారీ వాహనాల రాకపోకలను ఈ రోడ్డులో నిలిపివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సినిమాలు

శ్యామల	: రాయన్
సూర్య మినీ	: తుఫాన్
సూర్య ప్యాలెస్	: మురారి
స్వామి	: శివం భజే
శివజ్యోతి	: సింబా
అనుశ్రీ	: కమిటీ కుర్రోళ్లు
రంభ	: సూపర్ డీలక్స్
ఊర్వశి	: తుఫాన్
మేనక	: ల్యాండ్ మాఫీయా, బడ్డీ
కుమారి	: మురారి
అప్సర	: భవనమ్
అశోక	: కల్కి 2898ఏడీ
నామవరం	
వీఎస్ మహల్	: కమిటీ కుర్రోళ్లు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కమిటీ కుర్రోళ్లు
కడియం	
వెంకటసూర్య	: శివం భజే

'హర్ ఘర్ తిరంగా' అవగాహన ర్యాలీ


పాల్‌చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయం, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 'హర్ ఘర్ తిరంగా' అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ, శ్యామలా సెంటర్ మీదుగా స్వాతంత్ర్య సమర యోధుల పార్కు(పాల్‌చౌక్)కు చేరుకుంది. ఈ సందర్భంగా ట్రస్టు బోర్డు మెంబర్ మతల రమేష్ మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య సమర యోధులను స్మరిస్తూ ఉత్సవంగా జరపడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పార్కులో సామాజిక కార్యకర్త దేశిరెడ్డి బలరాంనాయుడు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పసల శివకుమార్, రిటైర్డ్ వాయుసేన ఉద్యోగి ఆర్ఎస్‌బీ రవి (కార్గిల్ పోరాట యోధుడు), ట్రస్టీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు), రెడ్డి బాబు, చలుమూరి సత్యనారాయణ, గ్రేడ్–3 లైబ్రేరియన్ పి.శ్రీదేవి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో కంటి వైద్య శిబిరం

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి జ్ఞాపకార్థం ఈ శిబిరం నిర్వహించినట్టు మాజీ సొసైటీ అధ్యక్షుడు మల్లిడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ పడాల వెంకటరామారెడ్డి ప్రారంభించారు. కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు మొత్తం 172 మందిని పరీక్షించారు.

వైఎంవీఏ ఆశయాలను కొనసాగించాలి

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు

సీటీఆర్ఐ: యంగ్ మెన్స్ వైశ్యా అసోసియేషన్ ఆశయాలను నూతన కార్యవర్గం కొనసాగించాలని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న వైఎంవీఏ హాలులో సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా శివరామ సుబ్రహ్మణ్యం, ముఖ్య అతిథిగా ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కూసుమంచి సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు పాల్గొన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎందరో ప్రముఖులు సేవా కార్యక్రమాలతో వైఎంవీఏకు మంచి పేరు తెచ్చారని చెప్పారు. నూతన అధ్యక్షుడు మైలవరపు శ్యామలరావు, కార్యదర్శి కన్నెగొళ్ల రవికాంత్, కోశాధికారి కొత్త వెంకటకిషోర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా 60 మంది పేద వైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బొండాడ ప్రభాత్, అప్పన షణ్ముఖ్ రంగరాజు, తోట లక్ష్మీనారాయణ (కన్నా), సహాయ కార్యదర్శులు గొల్లపూడి నాగేంద్రకుమార్, బత్తుల సిద్దార్థ, కారుమూరి చరణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మూరు ఇన్‌స్పెక్టర్‌గా కాశీవిశ్వనాథ్



ఎస్పీ నరసింహ కిషోర్‌ను కలిసిన సీఐలు కాశీవిశ్వనాథ్, గణేష్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి.కాశీవిశ్వనాథ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడున్న ఎండీ ఉమర్‌ను వీఆర్‌కు పంపించారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తామని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ విలేకర్లకు చెప్పారు, మహిళలను ఇబ్బందులు పెట్టడం, అనుచితంగా ప్రవర్తించడం క్షమించమన్నారు. నేరాలు, గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి గస్తీని పటిష్టం చేస్తామన్నారు. అనంతరం ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఐ గణేష్ బాధ్యతల స్వీకరణ

ధవళేశ్వరం: కొత్త ధవళేశ్వరం సీఐగా టి.గణేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో ధవళేశ్వరం ఎస్సైగా విధులు నిర్వర్తించారు. అనంతరం సీఐగా పదోన్నతి పొందారు. టూ టౌన్ సీఐగా పనిచేసి, ఎన్నికలకు ముందు విజయవాడ బదిలీపై వెళ్లారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన గణేష్‌ను పలువురు ప్రముఖులు కలిసి అభినందించారు. సీఐ గణేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

చిన్న పిల్లల వ్యాధులపై అవగాహన


వైద్య నిపుణులను సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పీఎంపీలు చిన్న పిల్లల వ్యాధులను గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేవీడీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పారా మెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో హుక్కుంపేటలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతు చిన్న పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై, సీజనల్ జ్వరాలకు ప్రాథమిక వైద్యంపై వివరించారు. మరో ముఖ్యఅతిథి డాక్టర్ సీహెచ్ శరత్‌చంద్ర పీఎంపీల సేవలను అభినందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య కార్యక్రమాలలో పీఎంపీలు పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, ఈ సందర్భంగా వైద్య నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, యు ప్రసాద్‌బాబు, ఏ సురేష్‌బాబు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచి మనసుకు 'నందూరి' మారుపేరు

జయంతి సభలో శివరామ సుబ్రహ్మణ్యం


సభలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ: సేవా దృక్పథానికి, మంచి మనసుకు నందూరి రమణ మారుపేరుగా నిలుస్తారని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం కొనియాడారు. ఆదివారం ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ దివంగత నందూరి వెంకటరమణ 60వ జయంతి సందర్భంగా స్థానిక ఏబీ నాగేశ్వరరావు పార్కు వద్ద నందూరి విగ్రహానికి నివాళులర్పించారు. సభలో ఆయన మాట్లాడుతూ రమణ అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేసి, జన హృదయాలలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. అనంతరం నందూరి రమణ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. బీసీ జాతీయ మహిళా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత మాట్లాడుతూ స్వయంకృషితో ఎదిగిన నందూరి రమణ ఆపదలో ఉన్నవారిని కులమతాలకతీతంగా ఆదుకున్నారని శ్రద్ధాంజలి ఘటించారు. స్వతంత్ర కార్పొరేటర్‌గా గెలిచి ఆయన డివిజన్ ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖులు పంతం కొండలరావు, టీకే విశ్వేశ్వరరెడ్డి, ఏవీ రమణ, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ బుడ్డిగ రవి, ప్రసాదుల హరినాథ్, వాకచర్ల కృష్ణ, కంచుమర్తి చంటి, నందూరి సుబ్బారావు, నందూరి రమణ కుమార్తెలు విమల, కమల, దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి చేతుల అలంకరణ


వెండి చేతుల అలంకరణలో శ్రీదేవి కనకదుర్గ అమ్మవారు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న శ్రీదేవి కనకదుర్గ అమ్మవారికి వెండి చేతులు అలంకరించినట్టు అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. ఆలయంలో ఉన్న అమ్మవారి వెండి వస్తువులన్నీ కలిపి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి కొత్త వెండి చేతులు చేయించినట్టు చెప్పారు. వీటిని శ్రావణమాసం అంతా అమ్మవారికి అలంకరిస్తారన్నారు. అమ్మవారి పాత వెండి కొంచెం మిగిలిఉందని, దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందిస్తే, అమ్మవారికి వెండి కిరీటం చేయిస్తారని తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

మధురపూడి: గరగలంపాలెం శివారు ప్రాంతంలో సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 200 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు కోరుకొండ ఎస్సై డి.ఆనందకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఈ దాడి జరిపారు. అక్కడ సారా తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, సారాతో పాటు, రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. బట్టీ వద్ద ఉన్న 3,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోటలోని ఆర్‌సీఎం ఎయిడెడ్ హైస్కూల్ 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకుని సందడి చేశారు. తాము చదివిన తరగతి గదులలో చేసిన అల్లర్లు, తీపి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. తొలుత అప్పటి హెచ్ఎం సిస్టర్ క్లోడియా, ఉపాధ్యాయులు వర్మ, మోహన్, వారితో చదివిన స్నేహితుల ఆత్మకు శాంతికలగాలని మౌనం పాటించారు. హెచ్ఎం ఎండీ అక్బర్, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

'గ్రామ దేవతలు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

సీటీఆర్ఐ: అన్ని వర్గాల వారు భాగస్వాములై, అందరితో పూజలందుకునే దేవతలే గ్రామ దేవతలని రాష్ట్రపతి పురస్కార గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. కొన్ని దేవాలయాల్లో కొన్ని కులాల వారే పూజలు చేస్తారని, గ్రామ దేవత ఉత్సవాల విషయంలో అందరూ పాలుపంచుకుంటారని చెప్పారు. డాక్టర్ చల్లా సత్యవాణి రచించిన 'గ్రామ దేవతలు' పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక కోర్లమ్మపేట కోర్లమ్మ తల్లి గుడి ప్రాంగణంలో జరిగింది. గౌరవ అతిథి గోపాలకృష్ణశాస్త్రి పుస్తకావిష్కరణ చేశారు. డాక్టర్ సత్యవాణి రాసే పుస్తకాలు సమాజానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఏ క్షేత్రం దర్శించినా అక్కడి స్థల పురాణం మొదలు, చారిత్రక విషయాలతో సమగ్రంగా పుస్తక రూపం తేవడం ఆమె గొప్పతనమన్నారు. శక్తి స్వరూపిణి వివిధ రూపాల్లో అమ్మవారిగా కనిపిస్తుందన్నారు. రాజమహేంద్రి విద్యా సంస్థల కరస్పాండెంట్ డా.టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సత్యవాణి రచనా సామర్థ్యాన్ని అభినందించారు. ప్రజాపత్రిక సుదర్శన్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నర్సరీల వద్ద ప్రమాద ఘంటికలు

కూలీలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు


అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరిన భారీ లారీ

కడియం: కుటుంబ పోషణ కోసం నర్సరీల్లో పని చేస్తున్న ఎగుమతి, దిగుమతి కూలీలకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మండలంతో పాటు, పరిసర మండలాల్లోని పలు గ్రామాల నుంచి మొక్కల ఎగుమతుల సీజన్‌లో పెద్దఎత్తున కూలీలు కడియం ప్రాంతానికి వస్తారు. వీరంతా వివిధ వాహనాలపై మొక్కలను ఎగుమతులు లేదా దిగుమతులు చేసేందుకు వెళుతుంటారు. దాదాపు 15 చదరపు కి.మీ. విస్తీర్ణంలో 20కి పైగా గ్రామాల పరిధిలో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఉదయాన్నే కడియపులంక నుంచి ప్రారంభమైన మొక్కల ఎగుమతులు వివిధ గ్రామాల పరిధిలో నిర్వహిస్తుంటారు. ఇందుకోసం వాహనాలపైనే కూలీలు ప్రయాణిస్తుంటారు. దీంతో రోడ్ల వెంబడి, నర్సరీల్లోనూ తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, రోడ్ల పక్కనే ఉండే ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా నిత్యం వీరికి ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ఇటీవలే కడియపులంకలోని ఒక నర్సరీల్లో వెర్రియ్య అనే కూలీ లారీపై ఉండగా విద్యుత్ తీగలు తగలడంతో దుర్మరణం పాలయ్యాడు. ఈ క్రమంలో కూలీలకు విద్యుత్ అధికారులు, నర్సరీ అసోసియేషన్ అవగాహన కల్పించే కార్యక్రమలు ముమ్మరం చేశారు.

జాగ్రత్తలు ఇలా..

సాధారణంగా భారీ లారీల్లో పెద్ద సైజు మొక్కలను లోడు చేసే క్రమంలోనే ఎక్కువగా విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. అటువంటి వాహనాల్లో ప్రయాణించ వద్దని సూచిస్తున్నారు. వాహనాన్ని రివర్స్ చేస్తున్నప్పుడు దూరంగా ఉండాలని కూలీలకు చెబుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుత వర్షాకాలంలో లారీలను రివర్స్ చేసేటప్పుడు అదుపుతప్పి పక్కకు జరుగుతున్నాయి. దీంతో సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్లను కానీ, విద్యుత్ వైర్లను కానీ తాకుతున్న ఘటనలు కూడా అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. దీంతో కూలీలు అప్రమత్తంగా ఉండాలంటున్నారు.